షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 268 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 11 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 268 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 11 August 2024 PAGES : 8 PRICE : 5/-

## నా కుటుంబమే నాపై దాడి చేస్తోంది

- నన్ను చంపాలని చూసే వాళ్లలో తన వాళ్లూ ఉన్నారని ఆవేదన
- కుటుంబ వివాదంపై ప్రెస్ మీట్ పెట్టిన ఎమ్మెల్సీ
- అర్ధరాత్రి మనుషులను వేసుకొని రావాల్సిన అవసరమేంటని ప్రశ్న
- తండ్రిని కలిసేందుకు కుమార్తె వచ్చే విధానమిదేనా? అని నిలదీత



## వినేశ్ ఫొగాట్ దురదృష్టవశాత్తూ పోటీకి దూరం కావాల్సి వచ్చింది

- కాంస్యం గెలిచిన అమన్ సెహ్రావత్‌కు అభినందనలు తెలిపిన పవన్
- రెజ్లింగ్ విభాగంలో మన క్రీడాకారుల ప్రతిభ ప్రశంసనీయమని వ్యాఖ్య
- అమన్ పతకం సాధించడంతో క్రీడాభిమానులు సంతోషంగా ఉన్నారన్న డిప్యూటీ సీఎం





## సైబర్ నేరాలు అరికట్టేందుకే సైబర్ సోల్జర్స్, కమాండోల వ్యవస్థ

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే పోలీసులు మారథాన్
- రోజురోజుకూ సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి
- అమాయకులను నమ్మించి వారి ఖాతాల నుంచి లక్షల్లో దోచేస్తున్నారు
- లోన్‌యాప్, లాటరీ తగిలిందంటూ వచ్చే ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి
- దేశవ్యాప్తంగా ఈ తరహా నేరాల సంఖ్య పెరుగుతోంది

అమరావతి

విజయవాడలో సైబర్ నేరాలకు వ్యతిరేకంగా నగర పోలీసులు చేపట్టిన సైబర్ క్రైమ్ అవేర్నెస్ వాక్ థాన్‌కు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే పోలీసులు మారథాన్ - మిగతా3లో

# టీడీపీ నయా ప్లాన్!

### టీటీడీపీలో పాత కమిటీల రద్దు

### ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వచ్చే 15-20 రోజుల్లో సభ్యత్వాల నమోదు

### గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంపై దిశానిర్దేశం

- తెలుగు ప్రజలు ఎక్కడున్నా బాగుండాలని కోరుకుంటున్నా
- తెలంగాణ అభివృద్ధి కోసం తాను మాట్లాడితే విమర్శించే వారు ఉన్నారు
- త్వరలోనే తెలంగాణ టీడీపీ అధ్యక్షుడ్ని నియమిస్తా: చంద్రబాబు
- హైదరాబాదులో తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం
- తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలు కోరుతున్నారన్న చంద్రబాబు
- మరో మూడు వారాల్లో సభ్యత్వ నమోదు ఉంటుందని వెల్లడి
- కొన్ని ప్రత్యేక కారణాల వల్ల తెలంగాణలో పోటీ చేయలేకపోయామని వివరణ



హైదరాబాద్:

తెలంగాణలో భవిష్యత్‌లో అధికారంలోకి రావడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు అన్నారు. అవసరమైతే మరోసారి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తానని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభావాలే తమకు ముఖ్యమని అన్నారు. రేవంత్ రెడ్డి మార్క్ బాగుందని ప్రశంసించారు. తెలంగాణ అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. విజన్ 2020 అంటే తనను 420 అని విమర్శించారని చంద్రబాబు అన్నారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ భవన్ లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ టీడీపీ ముఖ్య నేతలతో నేడు సమావేశం అయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వాల పెంపుపై చంద్రబాబు ఈ సమావేశంలో చర్చించారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో పార్టీ ఎత్తుపల్లాలు, విజయాలను - మిగతా3లో

## చంద్రబాబుకు ఎలాంటి విలువలూ లేవు

- చంద్రబాబూ... ఇది పచ్చి మోసం కాదా?
- చంద్రబాబు హామీల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారన్న జగన్
- అధికారంలోకి వచ్చాక తన నైజం బయటపెట్టుకున్నారని విమర్శలు
- రెండున్నర నెలల్లోనే ఇంత దగా చేస్తారా అంటూ ఆగ్రహం
- న్యాయం, ధర్మం పాటించని వ్యక్తి
- మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ
- ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- తన స్వార్థం కోసం బాబు ఏమైనా చెబుతాడు. ఏదైనా చేస్తాడు.
- నర్సీపట్నం, పెందుర్తి పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్



అమరావతి

న్యాయం, ధర్మం పాటించని వ్యక్తి అందుకే మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ నర్సీపట్నం, పెందుర్తి పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ తన స్వార్థం కోసం బాబు ఏమైనా చెబుతాడు. ఏదైనా చేస్తాడు. అలాంటి దుర్మార్గ వ్యక్తితో యుద్ధం చేస్తున్నామని వైకాపా అధినేత వైఎస్ జగన్ అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారు.మనం చేయగలిగిందే చెప్పాం చేసి చూపించాం. మన బలం ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతే బొత్సను గెలిపించి మన పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు సహకరించండి. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఆ వ్యక్తికి ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం తెలిసి ఉండాలి. ఆ స్థాయి వ్యక్తి అడుగులు వేసేటప్పుడు సమాజం చూస్తూ ఉంటుంది కాబట్టి, మనం ఏం చేస్తున్నాం అన్నది ఆలోచించాలి. - మిగతా3లో



## 12న నామినేషన్ వేస్తా

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేటర్లతో సమావేశం
- కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసిన వైసీపీదే విజయం
- తమకు సంఖ్యా బలం ఉన్నా పోటీకి రావడం వెనుక ఉన్న అంతర్యాం అర్థం కావడం లేదు
- వైసీపీ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖ లోని హోటల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ భేటీకి మాజీ మంత్రి కురసాల కన్నబాబు వైసీపీ నేతలు కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. - మిగతా3లో

## ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలి

- అన్ని స్కూళ్లలో ఇంటర్ నెట్ తప్పని సరిగా ఏర్పాటు చేయండి
- సిఎంతో సహా అందరం మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరవుతాం
- గత ప్రభుత్వం వేలకోట్లు వెచ్చిస్తే 2లక్షలమంది విద్యార్థులు ఎలా తగ్గారు?
- బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు

అమరావతి

ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలి. అన్ని స్కూళ్ళలో ఇంటర్ నెట్ తప్పని సరిగా ఏర్పాటు చేయండి సిఎంతో సహా అందరం మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరవుతాం. గత ప్రభుత్వం వేలకోట్లు వెచ్చిస్తే 2లక్షలమంది విద్యార్థులు ఎలా తగ్గారు? బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు సాల్ట్ ప్రాజెక్టుపై పాఠశాల విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష.. అమరావతి, నాణ్యమైన విద్యాబోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సి ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సహకారంతో అమలవుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ ఫర్మేషన్ - మిగతా3లో



# టీడీపీ నయా ప్లాన్!

-మొదటిపేజీ తరువాయి



ప్రస్తావించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ బలోపేతం అంశంపైనా ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణ టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి చంద్రబాబు వినతులు స్వీకరించారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లోని క్యాడర్ ను సమన్వయం చేసుకుంటూ నేతలు ముందుకెళ్లాలని సూచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ నూతన కమిటీల ఏర్పాటుపై చంద్రబాబు సంకేతాలు ఇచ్చారు.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వచ్చే 15–20 రోజుల్లో సభ్యత్వాల నమోదు ప్రారంభించే అవకాశాలు ఉన్నట్టు సూచనప్రాయంగా తెలిపారు. సభ్యత్వాల నమోదు పూర్తయ్యాకే కమిటీలు ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయాలని కార్యకర్తలు కోరుతున్నారని వెల్లడించారు. త్వరలోనే తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిని నియమిస్తానని తెలిపారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా తెలంగాణ ఎన్నిక టీడీపీ పోటీ చేయలేకపోయిందని చంద్రబాబు వివరించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తానని తెలిపారు. కొన్ని కారణాల వల్ల తెలంగాణలో పార్టీ బలహీనపడిందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

తెలుగు ప్రజలు ఎక్కడున్నా బాగుండాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం తాను మాట్లాడితే విమర్శించే వారు ఉన్నారని.. అయిన కచ్చితంగా అడుగుతానని అది తన బాధ్యత అని పేర్కొన్నారు. త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై ఫోకస్ పెడతానని అన్నారు. 15 రోజుల్లో తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. యువకులు, బీసీలకు పెద్దపీట వేస్తామని అన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ తర్వాతనే టీటీడీపీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు.

**టీటీడీపీలో పాత కమిటీల రద్దు..**

టీటీడీపీ ముఖ్యనాయకుల సమావేశంలో చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. టీటీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తూ చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఉన్న కమిటీలను రద్దు చేశారు. ఏపీ, తెలంగాణలో ఒకేసారి కొత్త కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అనంతరమే తెలంగాణ టీడీపీ నూతన అధ్యక్షుడి ఎంపిక చేస్తారని సమాచారం. ఏపీ తరహాలోనే కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ప్రతి నెల రెండో శనివారం, ఆదివారం తెలంగాణకు చంద్రబాబు రానున్నారు. పార్టీ నిర్మాణం పైనే అధినేత దృష్టి సారించనున్నారు.

**అపూర్వ స్వాగతం..**

కాగా, అంతకుముందు చంద్రబాబు ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు చేరుకున్నారు. అధినేతకు పసుపు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలతో ఎన్టీఆర్ భవన్‌లో జోష్ వచ్చింది. ఈ సందర్భంగా తెలంగాణ టీడీపీ నేతలు చంద్రబాబును ఘనంగా సన్మానించారు. అధినేత రాకతో ఎన్టీఆర్ భవన్‌లో కోలాహలంగా మారింది.

చంద్రబాబు జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ట్రస్ట్ భవన్‌కు టీటీడీపీ నేతల ర్యాలీతో బయల్దేరారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండోసారి టీడీపీ భవన్‌కి చంద్రబాబు వచ్చారు. అనంతరం తెలంగాణ నేతలతో బాబు భేటీ అయ్యారు. టీటీడీపీ నూతన అధ్యక్షుడు, పార్టీ బలోపేతంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ, సభ్యత్వ నమోదుపై చంద్రబాబు చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

# నా కుటుంబమే నాపై దాడి చేస్తోంది



పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. ఐదుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయా.. అయినా ఎప్పుడూ ఒకేలా ఉన్నానని వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ రోజు నా కుటుంబం గురించి నేనే చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా తన కుటుంబంలో జరుగుతున్న విషయాలపై ఆయన శనివారం మధ్యాహ్నం ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు. తన భార్య వాణి, కూతురు హైందవి చేస్తున్న ఆరోపణలపై, దివ్వెల మాధురితో తనకున్న సంబంధంపై పలు వివరాలను వెల్లడించారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసమే పనిచేశానని, చేస్తానని వివరించారు. భారత కుటుంబ వ్యవస్థలో భర్త అడుగుజాడల్లో నడిచే భార్యలను చూశానని దువ్వాడ చెప్పుకొచ్చారు. కానీ తన కుటుంబంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోందని వివరించారు. ముప్పై ఏళ్లుగా కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నానని, ఇకపైనా కాపాడుకుంటానని చెప్పారు. నా కష్టాలను, నష్టాలను కుటుంబం దాకా చేరనివ్వలేదని వివరించారు. ఇద్దరు కూతుళ్లను డాక్టర్లను చేశానని, పెద్ద కూతురుకు వివాహం చేశానని తెలిపారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా నా చేతికి అవినీతి మరక అంటుకోనివ్వలేదని, నిజాయతీకి కట్టుబడి పనిచేస్తున్నానని వివరించారు. ఈ క్రమంలో రాజకీయంగా, వ్యాపారపరంగా అనేకమంది శత్రువులను తయారుచేసుకున్నానని దువ్వాడ చెప్పారు. ఎవరు ఎప్పుడు ఎలా దాడి చేసి చంపేస్తారో తెలియదని, తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. ప్రాణాలతో ఉన్నన్ని రోజులు సంతోషంగా, కుటుంబాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నదే తన లక్ష్యమని వివరించారు. అయితే, తనను చంపేయాలని కుట్రలు పన్నుతున్న వారిలో తన కుటుంబ సభ్యులు కూడా చేరడం బాధాకరమని వాపోయారు. ఎంత బాగా చూసుకుంటున్నా తన భార్య వాణి కుటుంబంలో గొడవలు చేసేదని, వ్యాపార సంస్థలను, మైన్స్ లను తన పేరు మీద రాయాలని ఎన్నోమార్లు గొడవ చేసిందని దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. పిల్లల మనసుల్లో విషం నింపిందని, తండ్రిని నిలదీసేలా మార్చేసిందని మండిపడ్డారు. ప్రతీ కుటుంబంలోనూ గొడవలు వస్తాయని అయితే అవి నాలుగు గోడల మధ్యే పరిష్కరించుకోవాలని చెప్పారు. కానీ తన భార్య వాణి మాత్రం రాజకీయ ఆకాంక్ష, డబ్బుపై ఆపేక్షతో గొడవ చేస్తోందని ఆరోపించారు. తాజాగా అనుచరులతో కలిసి తన ఇంటిపై దాడికి వచ్చిందని చెప్పారు. భర్తను కలిసేందుకు వచ్చానని వాణి, తండ్రిని కలిసేందుకు వచ్చానని హైందవి చెబుతున్నారని గుర్తుచేస్తూ.. అర్ధరాత్రి భర్తను, తండ్రిని కలిసేందుకు రావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అనుచరులతో ఇంటి గోడను కూల్చి, డోర్ లాక్ ను రంపంతో కట్ చేయాల్సిన అవసరం ఏంటని నిలదీశారు. వాణి, హైందవి, వారి అనుచరులను చూసి బయటకు వస్తే తనను చంపేసే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే ఇంట్లో నుంచి బయటకు రాలేదని దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు.

# చంద్రబాబుకు ఎలాంటి విలువలూ లేవు

-మొదటిపేజీ తరువాయి



కానీ చంద్రబాబునాయుడికి న్యాయం, ధర్మం ఏవీ లేవు. దురదృష్టవశాత్తు మనం ఈ దుర్మార్గుడితో యుద్ధం చేస్తున్నాం. తన స్వార్థం కోసం ఏమైనా చెబుతాడు. ఏదైనా చేస్తాడు. అధికార, ధనబలంతో చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రతి పనీ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సినది కాదు. నాయకుడు అనేవాడు ఇంత అధ్వానంగా ఉంటాడా.. అన్న స్థాయిలో ఆయన పని చేస్తున్నాడు. ఇలాంటి వ్యక్తులతో మనం యుద్ధం చేస్తున్నాం. కష్టకాలంలో తోడుగా నిలబడ్డ ప్రతికార్యకర్తకు కచ్చితమైన గుర్తింపు వస్తుంది. నేను కోరేది ఒక్కటే. ప్రజలకు మనం దగ్గరగా, తోడుగా ఉంటే వారే చంద్రబాబును నామరూపాల్లేకుండా చేసే పరిస్థితి వస్తుంది. ప్రజలే దండలు వేసి మనల్ని పిలిచే రోజు వస్తుంది. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలకు తనదే హామీ అంటూ ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు... ఎన్నికలు అయిపోయి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. “ఈ రాష్ట్రం బాధ్యత నాది అని ఎన్నికలప్పుడు చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, అయినప్పటికీ సంపద సృష్టిస్తానని, హామీలకు నాదీ గ్యారెంటీ అని అనేక పర్యాయాలు చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలపై ఉందంటూ చంద్రబాబు తన నైజాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు... ఇది పచ్చి మోసం కాదా? చంద్రబాబూ... ప్రమాణ స్వీకారం చేసిన తొలి క్షణం నుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోతోందంటూ తప్పుడు శ్వేతపత్రాలు జారీ చేసి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. తల్లికి వందనం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు... కానీ ఇవ్వలేదు. రైతు భరోసా పథకంలో ప్రతి రైతుకు ఇస్తానన్న రూ.20 వేలు ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్ లో ఉంచారు. వసతి దీవెన పథకం అమలు చేయడంలేదు, సున్నా వడ్డీ పథకం లేనే లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు... దాని జాడే లేదు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వడంలేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం, మత్స్యకార భరోసా, పంటలకు ఉచిత బీమా అడ్రస్సే లేదు. వాలంటీర్లను మోసం చేశారు. ఇంటి వద్దనే పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది. ఇంటికి వచ్చి రేషన్ ఇచ్చే విధానం నిలిచిపోయింది. మధ్యాహ్న భోజన పథకంలో రోజుకో మెనూ విధానం మారిపోయింది. విద్యాకానుక కిట్ల పంపిణీ అరకొరగా సాగుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యమేలుతోంది. మహిళలకు రక్షణ లేదు. చంద్రబాబూ... రెండున్నర నెలల్లోనే ఇంత దగా చేస్తారా? ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలు ఆపేసి... సూపర్ సిక్స్ హామీలను తు.చ. తప్పకుండా అమలు చేయండి” అంటూ జగన్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలి

-మొదటిపేజీ తరువాయి

స్లాట్ ప్రాజెక్టు అమలుతీరుపై పాఠశాల విద్య అధికారులు, సంబంధిత ఏజన్సీల ప్రతినిధులతో ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ. గత ప్రభుత్వ హయాంలో సాల్ట్ ప్రాజెక్టు అమలులో వెనుకబడటంపై కారణాలను తెలుసుకున్నారు. నాడు–నేడు, సాల్ట్ వంటి పథకాలపై గత ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేసినట్లు కాగితాల్లో చూపుతోందని, అదే నిజమైతే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలమంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దీనిపై లోతైన విశ్లేషణ చేసి, నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. రాబోయే అయిదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ నెట్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎసెస్ మెంట్ మరింత శాస్త్రీయంగా ఉండేవిధంగా డిజైన్ లో మార్పులు చేయాలని ప్రథమ్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. డిజిటలైజ్డ్ ఎసెస్ మెంట్ ను మరింత సమర్థవంతంగా నిర్వహించి ఆన్ లైన్ కు అనుసంధానించడంపై దృష్టిసారించాలని ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సంస్థను ఆదేశించారు. టీచింగ్ టూల్స్ అబ్జర్వేషన్, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనాపద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ ఎల్ఎఫ్ఇ, ప్రతినిధులకు సూచించారు. ఆయా ఏజన్సీలు నిర్వహిస్తున్న ఎసెస్ మెంట్, శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, ఫలితాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని అన్నారు. ఇంటర్మీడియట్ లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రజాప్రతినిధులంతా మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరై తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల మెరుగైన పనితీరు కోసం తల్లులను భాగస్వాములను చేయాలని అన్నారు. బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, పిడబ్ల్యుసి ప్రతినిధులు సుచీంద్ర కుమార్, సోనాల్ శివగుండే, సునీత, కె.సురేష్ బాబు ప్రథమ్, దత్తాత్రేయ, మజీద్ ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్, వైభవ్ పాండే, నాగ సాయికృష్ణ కైవల్య ఫౌండేషన్, సిద్దేష్ శర్మ లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ, తదితరులు పాల్గొన్నారు.

## 12న నామినేషన్ వేస్తా

-మొదటిపేజీ తరువాయి



ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేటర్లతో సమావేశం అయ్యామని 12వ తేదీన నామినేషన్ వేస్తానని చెప్పారు. ఈ క్రమంలో అందరి సహకారం కావాలని కోరుతున్నానన్నారు.

మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ..

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కార్పొరేటర్లతో సమావేశం అయ్యామని, కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసిన వైసీపీదే విజయమని కన్నబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు సంఖ్యా బలం ఉన్నా పోటీకి రావడం వెనుక ఉన్న అంతర్యాం అర్థం కావడం లేదన్నారు. ఎవ్వరు ఎవరి కోసం గేట్లు తెరిచారో 2019 ఎన్నికల్లో చుసామన్నారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసిన వైసీపీకి విజయం ఖాయమన్నారు. బోత్స సత్యనారాయణ స్థానికేతరుడు అంటే మరి ఇక్కడ గెలిచిన సీఎం రమేష్ ఎక్కడి వారని కురసాల కన్నబాబు ప్రశ్నించారు.. కాగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయం ఏమంత తేలిక కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి అర్థమైపోయింది. దాని పరిధిలోని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో.. వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా.. పదికి పది స్థానాలను టీడీపీ కూటమి గెలుచుకోవడం మింగుడుపడడం లేదు. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లుగా ఉన్న వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు. టీడీపీ కూటమికి వారెవరూ అందుబాటులో లేకుండా కుటుంబాలతోపాటు దక్షిణ భారత యాత్రకు పంపుతున్నారు. ఇప్పటికే అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందినవారిని బెంగళూరు తీసుకెళ్లినట్లు వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇక పెందుర్తి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తమ కుటుంబసభ్యులతో గురువారం తాడేపల్లి నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి జగన్ మాట్లాడుతూ.. ప్రత్యర్థి పార్టీలు ఐదు లక్షలు ఇస్తాం.. పది లక్షలు ఇస్తామని బేరసారాలు చేస్తాయని.. వాటికి లొంగిపోయి అమ్ముడుపోవద్దని సూచించారు. 2014లో వైసీపీ నుంచి గెలిచి.. టీడీపీలోకి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలకు రూ.20 కోట్ల చొప్పున ఇస్తామని నమ్మించి.. కేవలం అడ్వాన్సు ఇచ్చి వదిలేశారని చెప్పారు. ఇప్పుడు కూడా విశాఖ జిల్లా స్థానిక ప్రజాప్రతినిధులకు అడ్వాన్సులతోనే సరిపుచ్చుతారని హెచ్చరించారు. అప్పుడు టీడీపీలోకి వెళ్లినవారు మోసపోయామని తెలిసి వెనక్కి వస్తామంటే రాజకీయ విలువల కోసం తాను రావద్దన్నానంటూ బుధవారం అరకు, పాడేరు నియోజకవర్గాల ప్రతినిధులకు చెప్పిన మాటే చెప్పారు. నాడు టీడీపీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలకు రాజకీయ భవిష్యత్ లేకుండా పోయిందన్నారు. విశాఖ స్థానిక సంస్థల్లో టీడీపీ కూటమి కంటే వైసీపీకి సుమారు 400 స్థానాలు అధికంగా ఉన్నా.. పలువురు ప్రజాప్రతినిధులు అధికార కూటమి వైపు చూస్తుండడంతో జగన్ ఆందోళన చెందుతున్నారు. ఓవైపు రాజకీయ విలువల గురించి మాట్లాడుతూ.. వారిని పది రోజులపాటు యాత్రలకు పంపుతుండడం గమనార్హం. ఆ తర్వాత విశాఖలో ‘క్యాంపు’ నిర్వహించనున్నారు. ఈ నెల 30న పోలింగ్ జరగనుంది.

## సైబర్ నేరాలు అరికట్టేందుకే సైబర్ సోల్జర్స్, కమాండోల వ్యవస్థ..

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. రోజురోజుకూ సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయని, అమాయకులను నమ్మించి వారి ఖాతాల నుంచి లక్షల్లో దోచేస్తున్నారని అనిత అన్నారు. ఇలాంటి నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి పేర్కొన్నారు. అపరిచితుల నుంచి మన ఫోన్లకు వచ్చే మెసేజ్, మెయిల్స్, వాట్సప్ మెసేజ్‌లకు స్పందించవద్దని, లోన్ యాప్, లాటరీ తగిలిందంటూ వచ్చే ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హోంమంత్రి అనిత హెచ్చరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు 250మంది సైబర్ కమాండోలు, 2వేల మంది సైబర్ సోల్జర్స్‌కు శిక్షణ ఇచ్చి నియమించినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఈ తరహా నేరాల సంఖ్య పెరుగుతోందని, వీటిని అరికట్టేందుకే సైబర్ కమాండోలు, సోల్జర్స్‌ను నియమించినట్లు సీపీ తెలిపారు. ఇకపై సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు పడకుండా వీరి ద్వారా తరచూ అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామని ఆయన చెప్పారు. రానున్న మూడు నెలల్లో మరో 3లక్షల మంది సైబర్ సైనికులను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు కమిషనర్ చెప్పుకొచ్చారు. ఈ తరహా నేరాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉంటున్నారని రాజశేఖర్ బాబు తెలిపారు. ఎవరైనా సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సీపీ రాజశేఖర్ బాబు సూచించారు

## వినేశ్ ఫొగాట్ దురదృష్టవశాత్తూ పోటీకి దూరం కావాల్సి వచ్చింది



పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. అమన్ కాంస్య పతకాన్ని సాధించడం ఆనందం కలిగించిందన్నారు. అమన్‌కు మనస్పూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. రెజ్లింగ్ విభాగంలో మన క్రీడాకారుల ప్రతిభ ప్రశంసనీయమన్నారు. అమన్ పతకం సాధించడంతో క్రీడాభిమానులు, భారతీయులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. మరో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ దురదృష్టవశాత్తూ ఫైనల్ కుస్తీ సమయంలో పోటీకి దూరం కావాల్సి వచ్చిందన్నారు.

**10 గంటల్లో 4.6 కిలోలు తగ్గిన అమన్**

వినేశ్ ఫొగాట్ ప్రభావంతో రెజ్లర్ అమన్ సెహ్రావత్ విషయంలో మేనేజ్‌మెంట్ జాగ్రత్తలు తీసుకుంది. సెమీస్‌లో ఓటమి తర్వాత గత గురువారం అమన్ బరువు 61.5 కిలోలుగా ఉంది. శుక్రవారం కాంస్య పోరు నాటికి 57 కిలోలు వచ్చేందుకు చాలా శ్రమించాడు. కేవలం 10 గంటల వ్యవధిలోనే 4.6 కిలోలు తగ్గాడు. అందుకు సీనియర్ కోచ్‌లు జగమందర్ సింగ్, వీరేందర్ దహియాతో పాటు మరో ఆరుగురి బృందం కష్టపడింది.

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం చేసే గ్యాంగ్‌లు ఏపీలోనే ఎక్కువట!

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసి వేలాది రూపాయలను కాజేస్తున్న ఏజంట్లు, ముఠా సభ్యులు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్నారు. అయితే ఏపీలోనే ఇటువంటి వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసే ఏజెంట్లు, సంస్థల జాబితాలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. ఈ రకం మోసాలపై లోక్‌సభలో టీడీపీ సభ్యులు హరీష్ బాలయోగి, బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో ఏపీలో భారీగా మోసాలు జరుగుతున్నాయని, గత నాలుగేళ్లుగా ఇవి ఎక్కువగా నమోదు అయినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ తరహా ఫిర్యాదులను ఏపీ పోలీస్ యంత్రాంగం సీరియస్‌గా తీసుకోలేదని వివరించింది. విదేశాలలో ఉద్యోగాల పేరుతో ఏజెంట్లు కూడా ఈ నాలుగేళ్లలోనే ఎక్కువగా పెరిగారని తెలిపింది. దేశ వ్యాప్తంగా 3,042 మంది నకిలీ ఏజెంట్లు ఉంటే వారిలో అత్యధికంగా 498 మంది ఒక్క ఏపీలోనే ఉన్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం



పంటల విషయంలో ప్రత్యేక దృష్టి పెడతాం

ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం

సోమశిల వద్ద పనులు పూర్తి చేస్తాం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)

నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ముందుగా జడ్పీ చైర్ పర్సన్ (తరువాయి 4లో...)

# సూపర్ 6 పథకాల అమలు ఎప్పుడు ?

తల్లికి వందనం పథకానికి మళ్ళీ వెన్నుపోటు

డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)



సూపర్ 6 పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, షేక్ సైధాలు ప్రశ్నించారు. శనివారం దర్శిరోడ్డు లోని ఎస్వి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేసంలో వారు మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్ 6 పథకాలు ప్రధాన కారణం అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 2 నెలలు కావచ్చింది. ఈ 6 పథకాలలో ఒక్క సామాజిక పథకం మాత్రమే అమలు అయింది. మిగతా 5 పథకాలు అమలు కాలేదు. అవి నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పథకం క్రింద స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000లు, ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా 20,000 ఆర్థిక సాయం, ప్రతి మహిళకు నెలకు రూ. 1500(19సంవత్సరాల నుంచి 59 సంవత్సరం వరకు), ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బిసి,ఎస్సీ,ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్, ఈ 5 పథకాలు అమలు కాలేదన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వం పదేపదే మాట తప్పుతోంది. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి అని మ్యానిఫెస్టోలో పేర్కొంది. 9న విడుదల చేసిన జీవో 29లో విద్యార్థి బదులు తల్లి అని పేర్కొంది. దీనిపై విమర్శలు రాగానే పొరపాటు జరిగింది. ప్రతి విద్యార్థికి ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడేమో



వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని చెబుతోంది. ఇది మోసం. మాట తప్పడం అని తులసి రెడ్డి, సైథా ధ్వజమెత్తారు. తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని,మిగతా పథకాలను ఎప్పటి నుండి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని తులసి రెడ్డి, సైదా డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో జిల్లా కిసాన్ సెల్ నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాబు, గోరంట్ల కోటేశ్వరరావు, ముల్లా జిలాని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాను. షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ నేతలు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు



- వెల్లువలా ఉప్పొంగిన అభిమానం
- శుభాకాంక్షలు తెలిపేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాల నుండి భారీగా తరలి వచ్చిన అభిమానులు
- పుట్టిన రోజు వేడుకల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించిన శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్ కుమార్
- జ్యోతి గ్రానైట్ సిఓఓ ఎమ్ శివరాం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

మాజీమంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు, మనవడు విహాన్ పుట్టిన రోజు వేడుకలు శనివారం హరిహర క్షేత్రంలో ఘనంగా జరిగాయి. గోల్డెన్ గ్రానైట్ ఏ గిరి ఆధ్వర్యంలో పుట్టినరోజు ఏర్పాట్లు మిన్నం టాయి. తమ అభిమాన నాయకుడి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా సుధీర్ కుమార్‌లకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ ను శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేశారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలు అందరి మన్ననలు పొందాయి. చీమకుర్తికి చెందిన భదిరధుల పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలు,పేపర్ (తరువాయి 4లో...)



# రోజుల వ్యవధిలోనే హత్య కేసు చేధన

## పొదిలి సిఐ, ఎస్ఐలకు ప్రశంసలు అందించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

పొదిలి సిఐ మల్లిఖార్జున, ఎస్ఐ జి కోటయ్యలు పొదిలి పట్టణం లోని పిఎన్ఆర్ కాలనీ వద్ద ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి చల్లా వెంకట నరేంద్ర బాబు హత్య కేసును రోజుల వ్యవధిలో చేధించడంతో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదరం వారిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. ఎస్పీ మాటల్లో ముద్దాయి కొండా శశి కుమార్ సుమారు ఒక సంవత్సరం క్రితం తన కుటుంబంతో పాటు మృతుడు ఇంటికి ఎదురుగా వున్న ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో 8 నెలల క్రితం మృతుడు చల్లా వెంకట నరేంద్రబాబు కుమారుడు ఆడుకొంటూ ఇంటి ముందు ఉన్న డ్రైనేజ్ కాలువలో ప్రమాదవశాత్తు పడి పోయాడు. అది చూసిన ముద్దాయి కొండ శశికుమార్ ఆ అబ్బాయిని డ్రైనేజీ కాలువ నుండి బయటకు తీశాడు. ఆ రోజు నుండి ముద్దాయి కొండ శశికుమార్‌తో మృతుడి భార్య చల్లా లక్ష్మి ప్రియకి పరిచయం ఏర్పడి ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటూ సాన్నిహిత్యం ఏర్పచుకొని మృతుడు ఇంటిలో లేని సమయములో ముద్దాయి (తరువాయి 4లో...)



# జీమాట్ 2024లో 99 శాతం మార్కులు సాధించిన సాహితీ రాయల్



అభినందించి ఆశీర్వదించిన ఎంపి మాగుంట, ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)

జీమాట్ 2024లో బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మిల ఏకైక కుమార్తె సాహితీ రాయల్ 99 శాతం మార్కులతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఒంగోలులోని ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా సాహితీ రాయల్, వారి తల్లిదండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ స్థానం సాధించిన సాహితి రాయల్‌ను ఆయన సత్కరించి అభినందనలు తెలిపారు. అదే విధంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫోన్‌లో అభినందనలు తెలిపారు. సాహితీ రాయల్ ఇటీవల నిర్వహించిన జీమ్యాట్ (టెస్ట్)లో 800 మార్కులకు గాను అత్యధికంగా 760 మార్కులు సాధించి 99 శాతంతో ప్రతిభను చాటారు. 99% పర్సెంటేజ్ మార్కులతో ప్రతిభను సాధించిన బెల్లంకొండ సాహితీ రాయల్‌కు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్ ఫర్డ్, హార్వర్డ్, పెన్సిల్వేనియా, కేంబ్రిడ్జ్, యూనివర్సిటీలలో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకానామిక్స్, స్టాన్ ఫోర్డ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లలోను జాతీయ స్థాయిలో (ఇండియన్ ఇన్ స్టుట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్) ఐఐఎం అహ్మదాబాద్, లక్నో, కలకొత్తా, బెంగళూరులలో (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్) పంజాబ్, హైదరాబాద్‌లలో ఎక్కడ కోరుకున్నా సీటు లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. శనివారం సాయంత్రం వారి స్వగృహం నందు కళాశాల అధ్యాపకులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు, డైరెక్టర్ మద్దుల శ్రీనివాసులు, బిఈడి కాలేజీ ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసులు, పొదిలి మాజీ ఎంపిటిసి సభ్యులు ఇమాంసా, బిట్స్ కాలేజీ ఉపన్యాసకులు ఝూనీ ప్రియా నాయుడు, అబ్దుల్లా, నేలటూరి డిబ్బారెడ్డి, భార్గవనాయుడు, మద్దుల లక్ష్మీకుమారీ, హామీద, కల్లూరి రవికుమార్‌రెడ్డి, శివప్రసాద రాజు, సుబ్బారావు, వీరిశెట్టి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది, తదితరులు సాహితీ రాయల్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలు వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# రోజుల వ్యవధిలోనే హత్య కేసు ఛేధన

## పొదిలి సిఐ, ఎస్ఐలకు ప్రశంసలు అందించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్








కొండ శశికుమార్ మృతుడి ఇంటిలోనికి వెళుతూ మృతుని భార్య లక్ష్మి ప్రియతో శారీరకంగా కలుస్తూ ఉన్నారు. అనంతరం కొద్ది రోజులకు లక్ష్మీ ప్రియ ప్రవర్తనలో మార్పు రావడం గమనించిన మృతుడు నరేంద్రబాబు వారిద్దరి మధ్య ఉన్న అక్రమ సంబంధాన్ని నిర్ధారించుకుని, లక్ష్మీప్రియ, శశికుమార్‌లను మందలించి లక్ష్మీప్రియకు ఫోన్ ఇవ్వకుండా దూరం పెట్టాడు. అందువలన వారిద్దరికి మాట్లాడుకోవటం ఇబ్బందిగా వుండి శశికుమార్ లక్ష్మి ప్రియకు ఎవరికీ తెలియకుండా లక్ష్మి ప్రియకు మరొక కొత్త కీ ప్యాడ్ ఫోన్ ఇచ్చి, ఇద్దరు ఫోన్లో ఎక్కువగా మాట్లాడుకుంటూ, వారి సంబంధాన్ని కొనసాగిస్తూ వున్నారన్నారు. మృతుడు తన భార్యను గట్టిగా మందలిస్తూ వున్నాడు. అది భరించలేని లక్ష్మి ప్రియా, శశికుమార్‌లు మృతుడిని ఎలాగైనా చంపి వారి అక్రమ సంబంధానికి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. లక్ష్మి ప్రియ ఇంటిలో బంగారు నగలను శశికుమార్‌కు ఇచ్చి వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో కిరాయి హంతకులను ఏర్పాటు చేసి వారి ద్వారా మృతుడిని చంపించాలని పథకం వేశారు. అందులో భాగంగా ఈ నెల 2వ తేదీన శశికుమార్ నెల్లూరు వెళ్లి నలుగురు వ్యక్తులను రూ.2,00,000లకు కిరాయికి మాట్లాడుకొని వారిని, అదే రోజు రాత్రి పొదిలికి తీసుకొని వచ్చి అర్ధరాత్రి మృతుడు నిద్రపోయిన తరువాత వారందరూ మృతుడి ఇంటిలోనికి వెళ్లి నిద్రపోతున్న మృతుని గొంతుకి తాడు బిగించి గట్టిగా లాగి ఉపిరి ఆడకుండా చేసి హత్యచేసి దానిని ఆత్మహత్యగా చూపించాలని వారందరూ కలిసి మృతుడిని వంటగదిలో తాడుతో వేలాడదీశారన్నారు. తన ఆదేశాల మేరకు పొదిలి సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ జి కోటయ్య తన సిబ్బంది నేతృత్వంలో ప్రత్యేక టీంను నియమించి నేరం జరిగిన తీరుని బట్టి త్వరితగతిన దర్యాప్తుకు జారీ చేసిన మార్గదర్శకాలు, సలహాలు అనుసరిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, హత్య కేసులో ముద్దాయిలను అరెస్ట్ చేశారు. ఈ కేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించడంలో ప్రతిభ కనపరచిన పొదిలి సిఐ మల్లికార్జునరావు, పొదిలి ఎస్ఐ జి కోటయ్య, తర్లుపాడు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పొదిలి కానిస్టేబుల్‌లు కోటేశ్వరరావు, గౌతమ్ కుమార్, రమేష్ బాబు, వీర్రాజులను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

# ఘనంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు























డెలివరీ బాయ్స్‌కు నూతన వస్త్రాలు, ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకునికి ఆర్థిక సాయంతో పాటుగా చీమకుర్తి కి చెందిన ఫోటో గ్రాఫర్ సుబ్బయ్య కు టీవీ బహుకరణ, చీమకుర్తి పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు నోట్ బుక్స్‌ను శిద్దా రాఘవ రావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ అందచేసి దాతృత్వం చాటుకున్నారు. దర్శి పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు అన్నదానాలు పెద్ద ఎత్తున ఆయన అభిమానులు నిర్వహించారు. అభిమానుల ఆత్మీయ శుభాకాంక్షలు సందర్భంగా చీమకుర్తి హరిహర క్షేత్రం సందడిగా మారింది. జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ శిద్దా రాఘవరావుకు శుభాకాంక్షలు తెలిపారు. చిమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖులు,ముఖ్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి అభిమానులు భారీగా తరలి వచ్చారు. తమ నాయకుడు శిద్దా రాఘవరావు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు రావూరి కాశీ రంగ జనార్ధన్ రావు, జలదంకి కృష్ణారావు, కొత్తురి శ్రీ రంగ నాయకులు,రాష్ట్ర వాసవి సేవా దళ్ చైర్మన్ పెనుగొండ శ్రీను, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి చి నిగేపల్లి సురేష్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గునుపూడి భాస్కర్, చలువాది బదరీ నారాయణ, మండల ఆర్యవైశ్య నాయకులు, వాసవి మహిళలు, చీమకుర్తి ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో తమ నాయకుడు శిద్దా రాఘవరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి శు భాకాంక్షలు తెలిపారు.

ప్రకాశం జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు అజీమ్, మండవ శ్రీను,మండవ గోపి,మన్నం ప్రసాద్,గొట్టిపాటి రాఘవ, ఆర్యవైశ్య మహా సభ మాజీ అధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు, బొమ్మిసెట్టి కిరణ్,గ్రంథి శ్రీహరి,నూకల సురేంద్ర, నూకల సుబ్రమణ్యం, చలగండ్ల హనుమంతరావు, వేమ శ్రీనివాసరావు, అంకరావు, డాక్టర్ జవహర్ తో పాటు చీమకుర్తికి చెందిన గ్రానైట్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు శిద్దా రాఘవరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఒంగోలులో అట్టహాసంగా మాజీమంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు

మాజీమంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు సందర్భంగా ఒంగోలులో వారి నివాసంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. బల్లి కురవ లక్ష్మి గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు,శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కట్ చేశారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు సందర్భంగా ఒంగోలు కు చెందిన ప్రముఖులు శిద్దా పాండురంగారావు, శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, శిద్దా భరత్, మంత్రి శ్రీనివాసరావు, టీ.అరుణ, గుమ్మడి సాయి బాబు, జ్యోతి గ్రానైట్ సి.ఓ.ఓ.ఎమ్.శివరామ్, గుప్తాస్ వీర బాబు, సివిల్ ఇంజనీర్ ఇలింద్ర సత్యనారాయణ, ప్రణీత్, రంగ మన్నార్, అద్దంకి మురళీ కృష్ణ,రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు పమిడి వెంకటరావు, గ్రంథి కార్తీక్, చలువాది హనుమంతరావు, రావిపూడి లక్ష్మి నారాయణ, సత్య సాయి సేవా సంఘం ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, లాయర్‌పేట సాయిబాబా మందిరం నిర్వాహకులు గ్రానైట్ సంస్థలకు చెందిన ప్రముఖులు, న్యాయవాదులు, శిద్దా రాఘవరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్, మన్యం ఫణికుమార్ దంపతులకు శ్రీ హరిహర క్షేత్రం ఆలయ అర్చకులు, శ్రీ శైలం వేద పండితులు, తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు వేద ఆశీర్వాదాలు అందచేశారు.

# వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం

ఆనం అరుణమ్మ...మంత్రి నారాయణకి పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో 62శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నా ˇన్నారు. ప్రధానంగా ప్రభుత్వం వ్యవసాయానికే అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చూస్తామని చెప్పారు. పంటల విషయంలో ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. మండల స్థాయిలో జిల్లా అధికారులు పర్యటించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఆయకట్టు స్థిరీకరణ విషయంపై చర్యలు చేపడుతున్నామన్నారు. కాలువల పూడికలు తీయాలని అధికారులను అదేశించామని చెప్పారు. త్వరలోనే సోమశిల వద్ద పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి నారాయణతోపాటు మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కిరాణా షాపులో చోరీ

## రూ.1.30 లక్షల నగదు, మూడున్నర సవర్ల బంగారం మాయం

### వివరాలు సేకరించిన క్లూస్ టీం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)**

పొదిలిలో భారీ చోరీ జరిగింది. పట్టణంలోని విశ్వనాధపురం కాలేజీ రోడ్లోని కిరాణా దుకాణంలోని వెనక తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. షాపులో శుక్రవారం రూ.1.30 లక్షల నగదు, 3.50 సవర్ల బంగారం దోచుకెళ్ళినట్లు షాపు యజమాని లక్ష్మీనారాయణ మీడియాకు తెలిపారు. సుమారు వీటి విలువ రూ. 5 లక్షల వరకు వుంటుందని యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటాయన్నారు.ఎస్ఐ జి కోటయ్య ఆదేశాలతో ఒంగోలు నుంచి క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించిందని ఎస్ఐ తెలిపారు.







# నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)**

నెల్లూరు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా కె.కార్తీక్‌ను నియమించింది. ఆయన 2020 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి కార్తీక్‌ను ప్రభుత్వం బదిలీపై నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది.

# అంబేద్కర్ విగ్రహం పై జరిగిన దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన






కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)**

భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడి హేయమైన చర్య అని వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. దాడులు మానుకొని ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు. ఈ విధమైన దాడులు మానుకో పోతే రానున్న రోజుల్లో ప్రజలు తప్పనిసరిగా బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజ్, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, కనిగిరి జడ్పిటిసి కస్తూరిరెడ్డి, సిఎస్‌పురం జెడ్పీటీసీ సభ్యులు మేకల శీను, కనిగిరి నియోజకవర్గం ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బొర్రారెడ్డి, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షుడు ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, హనుమంతునిపాడు మండల నాయకులు ఆదినారాయణరెడ్డి, వాలిచర్ల సర్పంచ్, బాబు, భాస్కర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దగదర్తి బోగోలు మండలాలలో విత్తన కొరతను తీర్చాలి

### నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)**

దగదర్తి బోగోలు మండలాలలో విత్తన కొరతను తీర్చాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి కోరారు. నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. సోమశిల జలాల కేటాయింపులో జలదంకి, కావలి, బోగోలు, దగదర్తి మండలాలను నీటి కేటాయింపులు పెంచాలన్నారు. నీటి కేటాయింపుల విషయంలో డెల్టా నాన్ డెల్టా పై రీ సర్వే చేపట్టాలన్నారు. నాటి పొలాలు నేటి నివాసయోగ్యమైన ప్రాంతాలపై చర్చ జరగాలన్నారు. కావలి కాలువ పూడికతీత తీసి ఐదు సంవత్సరాలయిందన్నారు. తక్షణమే కావలి కాలువలో పూడికతీతలు చేపట్టాలని, చిట్టచివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలన్నారు. కొబ్బరి చెట్ల పెంపకంలో రైతులకు అవగాహన కలిగించాలన్నారు. హార్టికల్చర్ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

# ఆనంను మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి, దారపనేని



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)

ఆంధ్ర రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శనివారం ఉదయం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పట్టు వస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆనం రామనారాయణ రెడ్డి రోడ్లు, భవనాలు శాఖ మంత్రివర్యులుగా, పర్యాటక శాఖ మంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్రానికి విశిష్ట సేవలందించారని, రాష్ట్ర విభజన తరువాత దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని, నెల్లూరు జిల్లాలో క్రియాశీలక రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న మకుటం లేని మహారాజు ఆనం రామనారాయణ రెడ్డి అని దారపనేని చంద్రశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డి కొనియాడారు.

# ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో ఆరోగ్య అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

ఒంగోలు గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఒంగోలు గొడుగుపాలెంలోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ లో శనివారం సాయంత్రం 78 మంది విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత మీద అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్త్రీ వ్యాధుల నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని టీనేజ్‌లో బాలికల శరీరంలో వచ్చే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత మీద అవగాహన కల్పించడం జరిగింది. అలాగే మహిళలో వివిధ వయస్సులలో సాధరణంగా వచ్చే వ్యాధుల గురించి చర్చించి వాటి నివారణా మార్గాలను సూచించారు. మహిళలకు వ్యాయామం, పౌష్టికాహారం మీద అవగాహన కల్పించారు. తదుపరి కౌమారదశలో వచ్చు ఆరోగ్య సమస్యల మీద బాలికలకు ఉన్న సందేహాలను నివృత్తి చెయ్యడం జరిగింది. అనంతరం హాస్టల్‌లో చదువుకుంటున్న బాలికలు అందరికీ ప్రత్యేకంగా తయారుచేసిన నోటు పుస్తకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ధన లక్ష్మి , హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, నాగండ్ల చిరంజీవి, సున్నపు తిరుపతి, విద్యార్థినులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లం రామకృష్ణను పరామర్శించిన దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, ఆగస్టు 10)

కొండపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బెల్లం రామకృష్ణ మాతృమూర్తి పద్మ ఇటీవల శివైక్యం పొందగా శనివారం వారి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. యువత అధ్యక్షులు బెల్లం రామకృష్ణకు తానున్నాను, ఎటువంటి భయం లేకుండా ఉండాలని భరోసా కల్పించారు. జీవితంలో ఒడిదుడుకులు సర్వసాధారణమని ప్రతి వ్యక్తి తన జీవిత గమన పయనాలను దాటాల్సిందేనని, కుటుంబ సభ్యులందరూ మనోధర్యంతో ఉండాలని, సత్య బెల్లం కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నలమోతు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి ఉన్నారు.

# సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)

నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశంలో పలు అంశాలపై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గళమెత్తారు. పలు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మతో పాటు మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్‌ను సోమిరెడ్డికోరారు. రైతులకు జీలుగ విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. ఉద్యాన శాఖ పరిధిలో వివిధ పథకాల కోసం జిల్లాలో ఖర్చు చేసిన మొత్తం గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ ప్రభుత్వంలో భారీగా తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యాన పంటల సాగు పెరుగుతున్న నేపథ్యంలో తదనుగుణంగా పథకాలు అమలు చేయాలని సూచించారు. మనుబోలు మండలం అక్కంపేటలో ఇటీవల క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఇరిగేషన్ పనుల్లో తాను గుర్తించిన అక్రమాలను సభ దృష్టికి తెచ్చారు. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో నాలుగు పనులు చేసినట్టు బిల్లులు పెట్టారు. తీరా పరిశీలిస్తే ఒక్క తట్ట మట్టి తీయలేదు. కంప చెట్టు కొట్టలేదన్నారు. రైతులు సొంత నిధులతో చేసుకున్న పనులకు కూడా బిల్లులు చేసుకున్నారన్నారు. మంత్రులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కలెక్టర్ వాటిని ఒక్కసారి పరిశీలించాలని కోరారు. సీఈ రిజెక్ట్ చేసిన రూ.18.70 కోట్ల విలువైన ఓ అండ్ ఎం పనులను ఎస్ఈ ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. రెండేళ్ల మెయింటినెన్స్ పీరియడ్ ను ఆర్నెళ్లకు తగ్గించడంలో ఆంతర్యమేమిటని అధికారులను నిలదీశారు. గత ఏడాది రెండో పంట సందర్భంగా 30 టీఎంసీల జలాలు వృథా అయిన అంశం సైతం సమావేశంలో ప్రస్తావించారు. లస్కర్లకు 20 నెలలకు పైగా జీతం ఇవ్వకపోవడం, కాలువల్లో తట్ట మట్టి ఎత్తకుండానే బిల్లులు చేసుకోవడంతోనే నీటి వృథా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేగపూడి -బండేపల్లి బ్రాంచ్ కెనాల్ పనుల్లో జాప్యం తగ్గదని, వెంటనే రీటెండర్ పిలిచి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మనుబోలు మండలం అక్కంపేటలో జగనన్న కాలనీ పేరిట దళితుల భూముల రికార్డులను మార్చి ప్రభుత్వం నుంచి కొందరు పెద్దమనుషులు రూ.93.50 లక్షలు డ్రా చేసిన వ్యవహారంపై కలెక్టర్ ప్రత్యేక విచారణ జరిపించాలని కోరారు. హౌసింగ్ శాఖలో ఆప్షన్ 3 కేటగిరిలో పేదలకు ఇళ్లు కట్టకుండానే నగదు, మెటరీయల్ డ్రా చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమగ్ర విచారణ జరపాలన్నారు. వరిగొండలో గిరిజనుల కోసం కట్టిన ఇళ్ల గోడలు కాలితో తంతే పడిపోయేంత నాసిరకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ భూముల లీజుల్లో భారీ వ్యత్యాసంపైనా సభలో ప్రస్తావించారు.





# కంట్రోల్ రూమ్ సిబ్బంది మరింత చురుగ్గా విధులు నిర్వహించాలి

## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంను ఎస్పీ తనిఖీ చేశారు. కంట్రోల్ రూంలో ఉన్న డయల్ 112, 100, టీవీ న్యూస్ వాచింగ్, వి హెచ్ ఎఫ్ సెట్ పనితీరు, పోలీస్ వాట్సాప్ , సీసీటీవీ సీట్ల పనితీరు వివరాలను గురించి సిబ్బందిని ఆరా తీసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలు తమకు ఎదురయ్యే వివిధ సమస్యలు మరియు ఇబ్బందులు గురించి పోలీసు వారి సహాయాన్ని ఆర్జించే క్రమంలో డయల్ -112, 100కు ప్రతిరోజు ఎక్కువ సంఖ్యలో ఫోన్ కాల్స్ చేస్తుంటారని, సిబ్బంది వెంటనే ఆ కాల్స్ ను స్వీకరించి దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరవేస్తే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వారికి తక్షణ సహాయం అందిస్తారని, అదే విధంగా వివిధ టెలివిజన్ల ఛానళ్లలో ప్రచురిఒపబడే జిల్లా సంబందించి ముఖ్యమైన సమాచారాన్నిసేకరిస్తూ సంబంధిత అధికారులకు తెలియచేయాలన్నారు. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తూ ధర్నాలు, ర్యాలీలు, ట్రాఫిక్ మరియు నిత్యం ముఖ్యమైన నేర సంబంధించ విషయాలను పరిశీలిస్తూ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది మరింత అంకితభావంతో చురుగ్గా, సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఎస్ఐలు ప్రభాకర్‌రెడ్డి, మీరాసాహిబ్, సిబ్బంది ఉన్నారు.



# నకిలీ స్టాంపులు, భూదందాలు, భూ కుంభకోణాల కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను కోరిన బీజేపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ నాయకత్వంలో ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని వివిధ బాధ్యతలు కలిగిన బిజెపి నాయకులు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని యోగయ్య యాదవ్ విన్నవించుకు న్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ కాలములో ప్రకాశం జిల్లాలో ముఖ్యముగా ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని ఒంగోలులో దాదాపు రూ.300 కోట్ల రూపాయల వరకు నకిలీ స్టాంపులు, భూ దందాలు, భూ కుంభకోణాలు జరిగాయని, దీని మీద సిబిఐ ఎంక్వయిరీ వేయాలని, బీజేపీ ఒంగోలు అసెంబ్లీ తరపున ఆనేక నిరసన కార్యక్రమాలు చేసినా గాని ఆనాటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సిట్ ఎంక్వయిరీ పేరుతో మసి పూసి మారేడు కాయ చేశారని, అసలైన ముద్దాయిలు ఆనాటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పక్కనే ఆయన కనుసన్నల్లోనే తిరుగుచున్నా గానీ పట్టించుకోలేదని, అసలైన ఆనకొండలు మాజీ మంత్రి ప్రక్కనే తిరుగుతుంటే చిల్లర పైసలకు కక్కుర్తి పడిన వారిని జైల్ పాలు చేసారని, తమరు ఈ కేసును త్వరితగతిన పరిష్కరించి, మోసపోయిన బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి దోషులను కఠినంగా శిక్షించాలని బిజెపి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా వచ్చేనెల 7న వినాయక చవితి ఉంది. గత ప్రభుత్వంలా కాకుండా గల్లీలో వినాయకుని మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను ఇబ్బంది పెట్టకుండా తక్షణమే మండపాలకు అనుమతులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒంగోలులో ట్రాఫిక్ సమస్య అధికముగా ఉన్నదని తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కో కన్వీనర్ ఐ.సీతారామయ్య, బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయారావు. తీగల సత్యవతి, ఏ.అనిల్, పి.తిరుమల, విజయ్ మోడీ, కటారి సుధాకర్ యాదవ్, సంజేకుమార్, కె.ఆంజనేయులు, గుర్రం రంగనాథ్, దేగా సురేష్, కమలాకర్, కొలా వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ జెండా ఆవిష్కరణ







**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఆగస్టు 10)**
యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన మండలంలోని ఎంపీడీవో కార్యాలయం దగ్గర శనివారం యుటిఎఫ్ సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో భాగంగా యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ, శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని సీనియర్ కామ్రేడ్ రిటైర్డ్ టీచర్ ఏ బాదుల్లా ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర ఆర్డిట్ కమిటీ సభ్యులు పి రమణ రెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం చేసి నా ఉద్యమాల వల్లే మనం అనేక రాయితీలను హక్కులను సాధించుకున్నామని కౌన్సిలింగ్ విధానం సాధించుకున్నామని, అప్రెంటిషిప్ రద్దు చేయించుకున్నామన్నారు. మరొక ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి బి.నరసింహారావు మాట్లాడుతూ సంఘం వల్లే రీ గ్రూప్ ఇన్ స్కేల్, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం, పిఆర్సీలు, డి ఏ లు సాధించు కున్నమని అన్నారు జిల్లా సహా అధ్యక్షులు అబ్దుల్ హై మాట్లాడుతూ ప్రస్తుతం విద్య వ్యవస్థలో జరుగుతున్న వర్క్ అడ్జస్ట్మెంట్ జీవో నెంబర్ 53 ప్రకారం చేయాలని, జీవో నెంబర్ 117, జీవో నెంబర్ 128 ద్వారా చేయడం ద్వారా మెర్జింగ్ హై స్కూల్స్లో ఎక్కువ సెక్షన్లు ఉండి తక్కువ మంది ఉపాధ్యాయులు అయి పని భారం ఎక్కువ అవుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించలేరని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విద్య అందరికీ అందించే దిశలో భాగంగా జీవో నెంబర్ 53 ద్వారా అడ్జస్ట్మెంట్ చేపట్టి ప్రభుత్వ పాఠశాల శాలలను మూత పడకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి.బుజిబాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కే సుబ్రహ్మణ్య చారి, కొనకనమిట్ల మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కామేశ్వరరావు, మండల సీనియర్ కామ్రేడ్ పి. శ్రీనివాసులు రెడ్డి, బి కృపారావు, కాసు తిరుపతి రెడ్డి, పి ఆంజనేయ చౌదరి సిహెచ్ మల్లికార్జునరావు, కాకునూరి వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ సుబ్బారావు, ఖాసిం సా,మునగ చెంచు రామారావు, చిన్నపురెడ్డి ప్రభాకర్ రెడ్డి, వడ్డీపాటి వెంకటేష్, కప్పల మాల్యాద్రి, పూసపాటి వెంకటేశ్వర్లు, మగ్రిపూడి వెంకట రమణయ్య, పొదిలి వలి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లిన విద్యార్థులు దుర్మరణం చాలా బాధాకరం

## ఎస్ఎంసి చైర్మన్ గుత్తి కొండలరావు



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 10)**
పామూరు పట్టణంలో పాత చెరువులోకి ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన విద్యార్థులు లోతు ఎక్కువగా ఉండటంలో మునిగిపోయి మృతి చెందారు. మృతి చెందిన విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులు మృతి చెందడం చాలా బాధాకరమని వారి



తల్లిదండ్రులకు తీరని లోటు అని చైర్మన్ గుత్తి కొండలరావు తెలిపారు.

# మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ అబ్దుల్ గఫార్





**షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)**
సైడ్ కాలువల్లో నిత్యం పూడిత తీస్తూ మురుగు నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరి పట్టణంలోని 14 వార్డులో సమస్య పరిష్కారంలో భాగంగా ఆయన పర్యటించి మున్సిపల్ కార్మికులు డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కాలువల్లో పేరుకుపోయిన పూడును తీసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో ఈ పనులు చేపట్టి ఎక్కడ డ్రైనేజీ నీరు కానీ, వర్షపు నీరు కానీ నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు





**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, ఆగస్టు 10)**
పెద్ద దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న అనేక మంది భక్తులు శ్రీశైల భ్రమరంభ మల్లికార్జున స్వామివార్ల దర్శనం కోసం వెళ్లేందుకు, దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో అనేక మంది ఎదురు చూస్తుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సులు కోసం దోర్నాల బస్టాండ్ ప్రాంగణంలో చిన్నపిల్లలు, వృద్ధులతో, వికలాంగులతో, తీర్థయార్థకు వెళ్లేటువంటి వారికోసం కనీసం తాగేందుకు మంచినీళ్లు సౌకర్యం లేదు, భక్తులు కూర్చునేందుకు సరైన వసతి లేదు, ఆర్టీసీ బస్టాండ్‌లో ఆరున్నర దాటితే సరేనా లైటింగ్ లేకపోవడంతో చీకటిగా ఉంటుంది ఆ చీకటిలో ఏ బస్సు వస్తుందో ఆ బస్సు ఎక్కడికి వెళుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ లో తాత్కాల్కంగా రెండు ఫ్యాన్లు ఉన్నాయి. ఆ రెండు ఫ్యాన్లు పనిచేయవు, మరమ్మతులు చేపించే నాథుడు లేడు. ఆర్టీసీ బస్టాండ్ కు నల్లమల ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులు శ్రీశైలం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులకు దోమలు ఎక్కువ కుడుతున్నాయి. పంచాయితీ వారు బ్లీచింగ్ పౌడర్ చల్లక్ పోవడంతో ప్రయాణికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉంటారు కానీ ఏ బస్సు ఏ సమయానికి వస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. కానీ ఆర్టీసీ అధికారుల లోపం వల్ల యాత్రికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంటే ఆర్టీసీ బస్టాండ్ లో కంట్రోలర్ లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు నిలబడే ప్రాంగణంలో ప్రైవేట్ వాహనదారులకు చెప్పేవారు లేకపోవడంతో ఇష్టానుసారంగా బస్టాండులో ఏర్పరచు కొని ఆర్టీసీ బస్సులు కంటే ప్రైవేట్ వాహనదారులు శ్రీశైలం వెళ్లే యాత్రికులను ఎక్కించుకొని వెళ్తున్నారు. అధికారులు యాత్రికులు పడుతున్న ఇబ్బందులను గమనించి సరేనా సౌకర్యాలను ఏర్పరచాలని స్థానికులు, యాత్రికులు తెలియజేశారు.

# టిడిపితోనే గ్రామాల భవిష్యత్తు భోగనంపాడు సర్పంచ్ సత్యకుమార్



**(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, ఆగస్టు 10)**
గ్రామ పంచాయతీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తాను నమ్ముతున్నారని మండలంలోని భోగనంపాడు గ్రామ సర్పంచ్ సత్య కుమార్ తెలిపారు. తూర్పునాయుడుపాలెం గ్రామంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో శుక్రవారం రాత్రి భోగనంపాడు గ్రామ సర్పంచ్ బడుగు సత్యకుమార్ మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు సారథ్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని తెలిపారు. గతంలో 2014 తెలుగుదేశం పార్టీ హయాంలో దాదాపు రాష్ట్రంలో 25వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టిన ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కింది అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన డ్రైనేజీ వ్యవస్థ పూర్తి ఆధునికరిస్తూ సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామాల్లో మౌలిక వసూలు కల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యావ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని స్వామి తెలిపారు. కొండపి నియోజకవర్గం గత 20 సంవత్సరాలుగా రాజకీయ భవిష్యత్తుకు అండగా నిలబడడంతో పాటు ప్రతి ఒక్కరు నన్ను సొంత బిడ్డల ఆదరించి అభిమానించి, నాకు మంత్రి అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తానని మంత్రి స్వామి తెలిపారు. రాబోయే రోజుల్లో యువ నాయకులు దామచర్ల సత్య సహకారంతో జిల్లాలో ఫార్మహబ్ నిర్మాణంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని స్వామి హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన సర్పంచ్ సత్య కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నాయకులు దోచుకోవడం దాచుకోవడంలో చూపిన శ్రద్ధ గ్రామాల అభివృద్ధిపై చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పంచాయతీ నిధులు పక్కదారి పట్టిస్తున్న ఒక్క నాయకుడు మాట్లాడలేదని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీ రావాల్సిన నిధులు సక్రమంగా రాబట్టడంలో సఫలీకృతమైందని ఆయన తెలిపారు. అందుకే తాను వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతూ పార్టీ ఆశయాలకు సిద్ధాంతాలకు అనుగుణంగా కష్టపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు తానికొండ మహేంద్ర, గ్రామ టీడీపీ నాయకులు ముళ్ళమూరి నితీష్ చౌదరి, పొన్నగంటి సుబ్బారావు, డబ్బుగొట్టు వెంకటేశ్వర్లు , దరిమడుగు అంకన్న , వంగాపాటి మాచర్ల, ఉక్కలం బాలకృష్ణ , కోటయ్య ,బిళ్ళ తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన పరసా రాజ

## రాజను ఆప్యాయంగా పలకరించిన నారా లోకేష్



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 10)**
విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబుని ఉండవల్లిలోని వారి నివాసంలో పరసా రాజ మర్యాద పూర్వకంగా కలిశారు. నారా లోకేష్ పరసా రాజను పలకరిస్తూ ఏం రాజ ఎలా ఉన్నావ్ అని ఆప్యాయంగా నారా లోకేష్ పలకరించారు. మన తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినందున చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ శుభ సందర్భంగా మీరు, నాన్న నిండు నూరేళ్లు ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నానని తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు పరసా రాజా అన్నారు.

## ఘనంగా కదిరి జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 10)
కదిరి బాబురావు విద్యాసంస్థల వ్యవస్థాపకులు కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన కళాశాలల సిబ్బంది, అభిమానులు కేక్ కట్ చేసి కదిరి బాబురావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కదిరి అభిమానులు, అధ్యపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించుకుంటే వ్యాపారం అద్భుతం

### శ్రీ మల్లి మిల్క్ అండ్ మిల్క్ ప్రోడక్ట్ డెయిరి ప్రారంభోత్సవంలో

### టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి









(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)
కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించుకుంటే వ్యాపారం అద్భుతంగా జరుగుతుందని.. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సంఘం మండలం దువ్వూరు జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ మల్లి మిల్క్ అండ్ మిల్క్ ప్రోడక్ట్ డెయిరి ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కోటంరెడ్డి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బల్లికురవ ఎస్ఐ గా జీవీ చౌదరి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)




క్రమశిక్షణ, పట్టుదల, డెడికేషన్ కష్టం విలువల తెలిసిన వ్యక్తిగా, పేద ప్రజలకు సేవ చేయాలి అంటే పోలీసు వ్యవస్థలో అడుగు పెట్టాలని సంకల్పంతో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించి, మొట్టమొదటి పోస్టింగ్ ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. అక్కడ ప్రజలు అభిమానం పొంది సాధారణ బదిలీల్లో భాగంగా యద్దనపూడి, కందుకూరు, కొరిసపాడు, పర్చూరు, యద్దనపూడి ఎస్‌హెచ్ఓగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బల్లికురవ ఎస్ఐగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

# ఆలయ నూతన కార్యవర్గానికి మంత్రి నారాయణ అభినందనలు

- నెల్లూరు స్టౌన్‌హౌస్‌పేటలో అట్టహాసంగా శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ నూతన కార్యవర్గ అభినందనసభ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి
- మంత్రికి ఘనంగా స్వాగతం పలికిన ఆలయ నూతన కార్యవర్గసభ్యులు
- అందరి సహకారంతో సుపరిపాలన అందించేందుకు కృషి
- తన గెలుపునకు ఎంతగానో కృషి చేసిన ఆర్యవైశ్యులందరికీ ధన్యవాదాలు తెలిపిన మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)
నెల్లూరు స్టౌన్ హౌస్ పేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నూతన కార్యవర్గ అభినందన సభ కార్యక్రమం కనీవినీ ఎగురని విధంగా అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హాజరయ్యారు. సభకు విచ్చేసిన మంత్రికి ఆలయ నూతన ఛైర్మన్, కార్యవర్గసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంత్రి నారాయణ... టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఏర్పాటు చేసిన భారీ అభినందనసభలో వేదికపైకి చేరుకున్న మంత్రి నారాయణ శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి నూతనంగా ఎన్నికైన ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవ అధ్యక్షులు కొండా ప్రవీణ్‌శంకర్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధానకార్యదర్శి శేగు షణ్ముఖరావుతో పాటు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటే తనకెంతో అభిమానమని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్యవైశ్యులు టీడీపీకి అండగా నిలిచి... తన గెలుపునకు కారణమయ్యారని వారిని ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి నూతనంగా ఎన్నికైన సభ్యులకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రం డెవలప్‌మెంట్ కావాలంటే వ్యాపారస్తుల సహకారం ఎంతో అవసరం ఉందన్నారు. వ్యాపారస్తులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 2024లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక వ్యాపారస్తులకు స్వాతంత్ర్యం వచ్చినట్లు అయిందన్నారు. గత ప్రభుత్వపాలనలో ఖజానా ఖాళీ అయిపోందని, డెవలప్‌మెంట్ లేకుండాపోయిందని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇండస్ట్రీలు వెళ్లిపోవడంతో రాష్ట్రానికి పెద్ద దెబ్బ తగిలినట్లైందన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు వ్యూహాత్మక ఆలోచనలతో నేడు రాష్ట్రానికి పరిశ్రమలు క్యూకడుతున్నారని మంత్రి నారాయణ చెప్పారు. ఈ క్రమంలో నెల్లూరు అభివృద్ధి కోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నెలకు రెండు సార్లు స్పెషల్ డ్రైవ్ పెట్టడం జరుగుతుందని, దీని ద్వారా అనేక ప్రజాసమస్యలు తీరుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరి సహకారంతో టీడీపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకలు ఆర్యవైశ్యులని కొనియాడారు. ఏ పని చేయాలన్న ఆర్యవైశ్యులు ముందుంటారని అభినందించారు. ఆర్యవైశ్యులకు టీడీపీ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత పాలకవర్గం లెక్కలు చెప్పకుండా జిమ్మిక్కులు చేస్తుందని మండిపడ్డారు. అలాంటివారికి తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరపడిందన్నారు. ఆర్యవైశ్యులకు మంత్రి నారాయణతో పాటు తామెప్పుడు అండగా ఉంటామని, ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా సంప్రదించవచ్చని కోటంరెడ్డి తెలియజేశారు.



# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)
నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం జనరల్ బాడి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై విద్యా, ఉపాధ్యాయ రంగా సమస్యలపై మాట్లాడారు. టీచర్ల వర్క్ అడ్జస్ట్మెంట్‌ని రాష్ట్ర స్థాయిలో చేయడం వలన ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని వివరించారు. అలానే టీచర్ల సీనియారిటిని.. పరిగణలోకిలోకి తీసుకుంటున్నారా లేక స్కూల్ సీనియారిటీని తీసుకుంటున్నారా తెలియజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఏ మేరకు ఉందో తెలియజేయాలన్నారు. వర్క్ అడ్జస్ట్మెంట్ విధానాన్ని అమలు చేసిన తరువాత జిల్లాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటుందా లేదా అన్న విషయాన్ని చెప్పాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్స్ నిర్వహణ బాధ్యతలను పేరెంట్స్ కమిటీకి అప్పగించి అవి సక్రమంగా నిర్వహించేలా చూడాలని కోరారు. అలాగే పాఠశాలలో నాడు నేడు పనులు జరిగిన అసంపూర్తి భవనాలు ఉన్నచోట.. పిల్లలకు ప్రమాదాలకు గురికాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కేఎన్ఆర్ స్కూల్లో జరిగిన విషాదం మరో చోట పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అక్కంపేట పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సభ్యులను ఎన్నుకున్న తర్వాత కూడా, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించకుండా.. ఎన్నికలు ఎందుకు వాయిదా వేశారో అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. ఉపాధ్యా యుల వర్క్ అడ్జస్ట్మెంట్ విషయంపై డిఈఓ చెప్పిన వివరణలో స్పష్టత కొరవడిందన్నారు. అలాగే అక్కంపేట పాఠశాల కమిటీ ఎన్నికల్లో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఈవో కంటి తుడుపు చర్యగా సమాధానం ఇచ్చారు.

## జీవో ఎంఎస్ 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలి

### బిటిఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకట్రావు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)
బహుజన టీచర్స్ అసోసియేషన్ ఒంగోలు డివిజన్ సమావేశం స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 117 రద్దు చేసిన తర్వాతనే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం అధికారంలో రాకముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్నటువంటి జీవో ఎంఎస్ నెంబర్ 117 ను తక్షణమే రద్దు చేయాలని తద్వారా ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో నాణ్యమైన అందించడానికి ఆరు సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించడం జరిగిందని ఇప్పుడు మరలా పోస్టులు రద్దు చేయడం సరైన విధానం కాదని రోల్ తో సంబంధం లేకుండా ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కర్ర దేవా సహాయం మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా సర్దుబాటు చేయాలని పని సర్దుబాటు స్వార్థ్యంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు నగర శాఖ అధ్యక్షులు మిరియాల వెలుకొండయ్య , జిల్లా ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, జిల్లా నాయకులు కొప్పోలు కిషోర్, పల్లె కృష్ణమూర్తి, కొండమూరి కొండల రాయుడు, పి తిరుపతిస్వామి, చెక్క కోటేశ్వరరావు, అత్తలూరి నాగమల్లేశ్వరరావు, షేక్ ఫయాజ్, పి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా

**ఎంపీ వేమిరెడ్డి**
**జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం**
**సమావేశంలో పాల్గొన్న ఎంపీ**
**కేంద్ర పరిధిలో తాను చేయగలిగిన పనులు చేస్తా**
**హాజరైన మంత్రులు నారాయణ, ఆనం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 10)** జిల్లా అభివృద్ధే తొలి ప్రాధాన్యతగా పనిచేస్తామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు అన్నారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఆనం అరుణమ్మ దంపతులు శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం కొలువు తీరాక జరిగిన తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరైన ఈ సమావేశం జిల్లా అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే పార్లమెంట్ సభ్యుడిగా నెల్లూరు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ఎలాంటి సహకారం కావాలన్నా చేసేందుకు తాను ముందుంటానని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించుకోదగిన సమస్యలకు ఇక్కడే పరిష్కారం చూపుతామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఒకవేళ ఆ విషయం రాష్ట్రస్థాయిలో లేదా కేంద్రస్థాయిలో పరిష్కరించాల్సి వస్తే తప్పకుండా ఎంపీగా తాను, జిల్లా మంత్రులుగా నారాయణ గారు, ఆనం సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. జిల్లాకు సంబంధించి కేంద్రస్థాయిలో పరిష్కారం కాగల సమస్యలేవైన తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ , దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డిలతోపాటు...కలెక్టర్ ఆనంద్, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి , కావ్య కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి , పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ , వివిధ శాఖల ముఖ్య అధికారులు హాజరయ్యారు.



# నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలి

**నీట్ యుజీ పరీక్షను తిరిగి నిర్వహించాలి**



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)**

కనిగిరి టీచర్స్ అకాడమీలో జరిగిన ఉద్యోగార్థుల సదస్సులో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు పీవీ శేషయ్య మాట్లాడుతూ 2018లో యు పి ఎస్ సి ని రద్దు చేసి, దాని స్థానంలో ఏర్పాటు చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని, నీట్ యూజీ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖలలో లక్షల పోస్టులు ఖాళీగా ఉన్న, కోట్లాది పోస్టులు కొత్తగా ఏర్పాటుకు అవకాశం ఉన్న, రిక్రూట్మెంట్ అధ్వాన స్థితిలో ఉందన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా 1100 పిటిషన్ లు సుప్రీంకోర్టులోను వివిధ హైకోర్టులలోను దాఖలయ్యాయన్నారు.

పరీక్షల నిర్వహణలో అక్రమాలకు వ్యవస్థ గత కారణాలు, లాభాలే పరమావధిగా ఉన్న నేరస్తులతో కుమ్మక్కైన పాలన యంత్రాంగమే కారణం అన్నారు. నోటిఫికేషన్ అనంతరం పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ఆరు నెలల లోపల నియామకాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న పాలకులు మాట తప్పారన్నారు. స్టడీ సెంటర్స్ ను కోచింగ్ సెంటర్స్ ను ప్రభుత్వమే నాణ్యమైన సిబ్బందితో నిర్వహించాలన్నారు. 2011లో ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే 2018లో అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇచ్చారన్నారు. ఏడేళ్ల విలువైన నిరుద్యోగుల జీవిత కాలాన్ని కాజేసారన్నారు. 2003 డీఎస్సీ వాళ్లకు 2005లో, 2006 డీఎస్సీ వాళ్లకు 2009లో , 2018 డిఎస్సీ వాళ్లకు 2021 లో పోస్టులు ఇచ్చారన్నారు. ప్రతి డీఎస్సీకి మధ్య మూడు సంవత్సరాల విలువైన కాలాన్ని నిరుద్యోగులు కోల్పోయారన్నారు. నేడు ఉపాధ్యాయుల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ఖాళీలను పూర్తిస్థాయిలో ప్రకటించకుండా నామమాత్రంగా డీఎస్సీ నిర్వహించడం నిరుద్యోగులను మోసగించడమే అన్నారు. టెట్టు డీఎస్సీలకు ఒకేసారి తేదీలను ఇవ్వకపోవడం వాస్తవ ఖాళీ పోస్టుల సంఖ్యను ప్రకటించి భర్తీ చేయకపోవడం కోర్టులకు వెళ్లే అవకాశాన్ని ప్రభుత్వమే కల్పించడం ఇవన్నీ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. 2024 డిసెంబర్ లోపే నోటిఫికేషన్, పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని పీవీ శేషయ్య అన్నారు.

# ఘనంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 10)**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట , దొరవారిసత్రం మండల శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె ప్రభాకర్ అధ్యక్షత వహించారు. తొలుత యూటిఎఫ్ సీనియర్ నాయకులు పి శ్రీనివాసులు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు జీజె.రాజశేఖర్ మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిన యూ టి ఎఫ్, అనేక సమరశీల పోరాటాలు, ఆందోళనలు చేసి ఉపాధ్యాయుల సంక్షేమమే గాక విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందని భవిష్యత్తులో కూడా ఈ పంథాలోనే కొనసాగుతుందని , ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి కోసం కృషిచేయాలని ఇందుకు అడ్డుగావున్న 117జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి సహకరించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధింపజేయాలని, ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను కూడా సమాంతరంగా ఉంచాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. అనంతరం సూళ్లూరుపేట పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కే ఎం ఎస్ సునీల్ ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్ బాబు, సిఐటి నాయకులు పద్మనాభయ్య, సుధాకర్, లక్ష్మయ్యలు , విశ్రాంత ఉపాధ్యాయులు కే వెంకటరమణయ్య,మూడు మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రామ్మూర్తి, జనార్ధన్, కేటి నవీన్ కుమార్, సర్దార్, హుస్సేన్ భాష, రమేష్, ఉష, జానకి, సంధ్య, రాజేశ్వరి, లక్ష్మీ ప్రసన్న, మమత, సుజాత, మంజులవాని, శార్వాణి, సుకన్య, నాగరాజు,ఓ శ్రీనివాసులు, వెంకటస్వామి, శ్రీనివాసులు 70 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను పరిశీలించిన బీజేపీ నేతలు

**(షణ్ముఖ వెలుగు, రాచర్ల, ఆగస్టు 10)**

రాచర్ల మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాల (గర్ల్స్)లో విద్యార్థినులకు అందుతున్న వైద్య, విద్య, ఆహార ఉత్పత్తుల కల్పన వారికి ప్రభుత్వం అందిస్తున్న వసతులు అక్కడ ఉన్న హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఏమైనా వసతులు లేమి ఉంటే తెలియ చేయాలని అడుగగా సంపూర్ణంగా అందుతున్నాయని విద్యార్థుల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షుడు భవనాసి వెంకట రామాంజనేయులు పాల్గొన్నారు. గిద్దలూరు పట్టణ అధ్యక్షులు పిల్లలకు పలు సూచనలు చేశారు. వారికి బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు,సమాజ అభివృద్ధికి,వారి కుటుంబ ఆర్థిక తోడ్పాటుకు ప్రతి ఒక్క విద్యార్థి పోటీ తత్వం తో చదవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్, జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టే మల్ల పుల్లయ్య, గిద్దలూరు పట్టణ ఉపాధ్యక్షులు ఏంవీ రమణ పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com